క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆదోని అర్బన్: మండలంలోని విరుపాపురం గ్రామంలో జంగమ మంజులమ్మ మూడు రోజుల క్రితం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జంగమ కులస్తులు, ఆదోని డివిజన్ అర్చక సంఘం గౌరవాధ్యక్షుడు మహర్షి విజయ్‌కుమార్‌స్వామి, అధ్యక్షులు వీరభద్రస్వామి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబంలో పదేళ్లలోపు వయసున్న బాలుడు ఉన్నారని, అతని చదువుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే జంగమ సంఘం తరపున ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. జంగమ కులస్తులు మహేష్, హనూరు శివయ్య, మది వీరేష్ తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయాలి



సజ్జలగుడ్డం గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న కుటుంబాలకు ప్రభుత్వం వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరుచేసి నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, గ్రామ కార్యదర్శి మూకప్ప కోరారు. ఈ మేరకు ఆదివారం గ్రామ ఎస్సీ కాలనీ వాసులతో కలిసి వారు మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా కాలనీవాసులు బహిర్భూమికి ఆరుబయట పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోందని, రాత్రిళ్లు విషపురుగులు సంచరిస్తుండడంతో భయం భయంగా వెళుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఎస్సీ కాలనీవాసులకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: బక్రీద్ పండగ సందర్భంగా ఆదోని పట్టణంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి డీఎస్పీ పలు సూచనలు చేశారు. బక్రీద్ పండగ రోజున ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వెంటనే అదుపులోకి తీసుకోవాలన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండగను నిర్వహించుకునేలా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘర్షణలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సీఐలు గోపీ, తేజమూర్తి, నిరంజన్‌రెడ్డి, మంజునాథ్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

క్రీడా మైదానంలోకి అనుమతించరా?



పీడీతో వాగ్వాదం చేస్తున్న క్రీడాకారులు

ఆదోని అర్బన్: స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలోకి తమను ఎందుకు అనుమతించడం లేదని పీడీ కంబిరెడ్డితో క్రీడాకారులు ఆదివారం వాగ్వాదానికి దిగారు. వీఐపీలకు మాత్రమే మైదానంలో క్రీడలు ఆడాలన్నా, వ్యాయామం చేయాలన్నా అనుమతి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం తామంతా క్రీడా మైదానంలోకి వస్తే వాచ్‌మెన్‌లు అడ్డగిస్తున్నారని, ముందస్తు అనుమతి తీసుకోవాలని అడ్డుపడుతున్నట్లు వాపోయారు. దీనిపై యువకులంతా అధ్యాపకుడు అయ్యప్ప, పీడీ కంబిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. మైదానంలో ఆడాలంటే కరస్పాండెంట్ దైవాధీనంరెడ్డి అనుమతి తీసుకురావాలని పీడీ చెప్పడంతో వారంతా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి తామంతా ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆటలతో పాటు వ్యాయామం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మైదానంలోకి వెళ్లేందుకు అనుమతి తీసుకోవాలని ఎందుకు అంటున్నారో తెలియదన్నారు. ఎవరో దొంగతనం చేస్తే వారిని పట్టుకుని శిక్షించాలే గానీ క్రీడాకారులను ఆడేందుకు అనుమతించడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే కళాశాల ప్రిన్సిపాల్, పీడీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యువత, విద్యార్థులు క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం ఆడుకోవచ్చని అనవసరమైన చెడు అలవాట్ల జోలికి వెళ్లరాదన్నారు.

దివ్యాంగుల భవితకు వెలుగులు

- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపయోగం
- ఇంటింటి సర్వే చేసిన భవిత ఉపాధ్యాయులు



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను సర్వే చేస్తున్న భవిత ఉపాధ్యాయులు



దివ్యాంగ పిల్లల గుర్తింపునకు సర్వే చేస్తున్న భవిత ఆర్‌పీలు

ఆదోని సెంట్రల్: శారీరక, మానసిక దివ్యాంగ చిన్నారుల కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బ్రెయిలీ నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుంది. అంతేగాకుండా పిల్లల పట్ల తల్లిదండ్రులు అనుసరించాల్సిన నడవడికపై కౌన్సెలింగ్ ఇస్తారు. భవిత కేంద్రాల్లో చదువుకున్న పిల్లలకు ఇతర పిల్లలతో పాటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వీలును కల్పిస్తున్నారు. అందుకే గ్రామాల్లో, పట్టణాల్లో చదువుకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను (దివ్యాంగ) గుర్తించి విద్యను అందించే దిశగా భవిత ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. వారు గుర్తించిన పిల్లల వివరాలను జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) రూపొందించిన ప్రశస్త యాప్‌లో ఉపాధ్యాయులు నమోదు చేస్తున్నారు.

ముగిసిన ఇంటింటి సర్వే

ఆదోని నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించేందుకు సహిత ఉపాధ్యాయులు చేపట్టిన సర్వే కార్యక్రమం ముగిసింది. భవిత కేంద్రం ఉపాధ్యాయులు మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సర్వేలో 86 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించారు. వారి వివరాలను ఎన్‌సీఈఆర్టీ ప్రశస్త యాప్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల అవసరాలను బట్టి అంగ వైకల్యం అధికంగా ఉంటే పింఛన్, బస్సులు, రైళ్ల రాకపోకల్లో రాయితీతో కూడిన ప్రయాణం వంటి అవకాశాలను కల్పిస్తారు. పాఠశాలకు వెళ్లలేని వారి ఇంటి వద్దకే ఉపాధ్యాయులు వెళ్లి శిక్షణ ఇస్తారు.

ఉచితంగా ఉపకరణాలు

చదువుకునే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందుతాయి. భవిత కేంద్రం ద్వారా 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన దివ్యాంగ చిన్నారులకు వైద్య సేవలను అందిస్తారు. విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వీరికి మెరుగైన సదుపాయాలను కల్పించనున్నారు. పాఠశాలల్లో చేరే పిల్లలకు నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు ఇస్తారు. 9, 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.12 వేలు చొప్పున అందిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా ట్యాబులను అందజేస్తారు. ప్రతిభావంతులను గుర్తించి ఉన్నత విద్య ఉపాధి అవకాశాలను కల్పిస్తారు.

అవగాహన కలిగి ఉండాలి



ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి. చాలామందికి సరైన అవగాహన లేక అంగవైకల్యం కలిగిన పిల్లలను ఎక్కడ ఉంటే అక్కడే ఉంచేస్తున్నారు. దీంతో పిల్లలు మానసిక పరిపక్వత చెందక మంచానికే పరిమితమవుతున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు కూడా మానసిక, శారీరక అంశాలపై అవగాహన కల్పించి విద్యను అందించడానికి భవిత కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతిఒక్కరూ ప్రభుత్వాలు అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– శాంతకుమార్, ఈఐఆర్‌పీ

నిరుపయోగంగా ఎస్సీ హాస్టల్ భవనం



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం

మద్దికెర: విద్యార్థులు తక్కువ ఉన్నారనే ఉద్దేశంతో హాస్టళ్లను ఎత్తివేశారు. దీంతో వారి కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రమైన మద్దికెరలో ఎనిమిదేళ్ల క్రితం ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు సొంత భవనం కోసం రూ.75 లక్షలు మంజూరు చేసి నూతన భవనం నిర్మించారు. కానీ ఆరేళ్ల క్రితం తగినంత మంది విద్యార్థులు లేరని సాకు చూపి తీసివేసి అందులో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఇతర హాస్టళ్లలో చేర్పించి అధికారులు చేతులు దులుపుకున్నారు. పేద విద్యార్థులందరికీ విద్యనందించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తే విద్యార్థులు లేరని సాకుచూపి ఎత్తివేశారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం నిరుపయోగంగా మారడంతో శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకైనా వినియోగించుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి



విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టపడి చదవాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ సూచించారు. వారు ఆదివారం స్థానిక మంగళ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో బల్లేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను గుర్తుంచుకుని తల్లిదండ్రుల ఆశయ సాధనకు అనుగుణంగా చదువుకోవాలని హితవు పలికారు. అనంతరం 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.6 వేలు, మూడవ బహుమతి రూ.4 వేలను అందించారు. అలాగే మండల స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.2 వేలు, రెండవ బహుమతి రూ.1500, మూడవ బహుమతి రూ.వెయ్యి నగదుతో పాటు ప్రశాంసా పత్రాలు, మొమెంటోలను అందించారు. కార్యక్రమంలో పురపాలక చైర్మన్ బి.శాంత, డాక్టర్ కేఆర్.స్వామి, బ్యాంకు మేనేజర్ వీరన్న, శివరాములు జిల్లాలోని వాల్మీకి ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఆయా మండలాల నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను అందించండి

ఆదోని అర్బన్: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించేందుకు ప్రతి ఎరువుల డీలర్ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. ఆయన ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎరువుల డీలర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పాడేగల్ మురళీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బంది కలగకుండా నాణ్యమైన విత్తనాలను అమ్మకాలు చేయాలని సూచించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఎరువులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు ఎం.సి.సుంకన్న

ఆదోని సెంట్రల్: విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్న జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి. సుంకన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవనంలో ఆదివారం ఆదోని ఎస్టీయూ మండలాధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజాగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇచ్చిన మాట మేరకు జీఓ రద్దు చేయాలన్నారు. విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు గోపాల్, రామాంజనేయులు, వెంకటేశులు, రామ్మోహన్‌రెడ్డి, రంగన్న గౌడ్, ఆంజనయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

హాలహర్వి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హాలహర్వి పీహెచ్‌సీ వైద్యాధికారి తిమ్మయ్య సూచించారు. ఇళ్లు, ఇంటి పరిసరాల్లో ఎక్కువ కాలం నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు ఉన్నచోట దోమలు ఉంటాయని, రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలన్నారు. దోమకాటు వల్ల చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు సోకుతాయని తెలిపారు. జ్వరం, జలుబు, దగ్గు వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు స్వామి వారి మూల విరాట్‌లకు సుప్రభాతం సేవా, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలువురు భక్తులు అన్నదానం చేశారు. మరికొందరు భక్తులు ఆలయ మెట్లకు పసుపు కుంకుమ పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గంగాభవానీ జయంత్యుత్సవాలు



అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపులో కలశాలతో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

- ప్రధాన రహదారుల్లో అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు
- పెద్దసంఖ్యలో పాల్గొని పులకించిన భక్తజనం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ గంగాభవానీదేవి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. తుంగభద్ర నుంచి తెచ్చిన నీటితో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వాహనంలో ఉంచి ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని లక్ష్మమ్మవ్వ ఆలయానికి చేరి అమ్మవారికి పూజలు నిర్వహించి తిరిగి అదే ప్రధాన రహదారుల్లో ఊరేగింపుగా గంగాభవానీ ఆలయంకు చేరుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఊరేగింపులో జై గంగాభవానీ నామస్మరణ మార్మోగింది. భక్తులు ఎరుపు జెండాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. గంగపుత్ర సంఘం సభ్యులు, కులపెద్దలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ దేవి

భారీగా పొట్టేళ్ల అమ్మకాలు

- కిటకిటలాడిన ఎమ్మిగనూరు సంత
- రూ.50 వేల వరకు ధర పలికిన పొట్టేళ్లు



ఎమ్మిగనూరు మార్కెట్‌లో విక్రయానికి తెచ్చిన పొట్టేళ్లతో వ్యాపారులు

ఎమ్మిగనూరుటౌన్: బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో ఆదివారం స్థానిక మేకల మార్కెట్ క్రయవిక్రయదారులతో కిటకిటలాడింది. సోమవారం బక్రీద్ పర్వదినం కావడంతో వ్యాపారులు అధిక సంఖ్యలో పొట్టేళ్లను విక్రయానికి తీసుకొచ్చారు. పొట్టేళ్ల విక్రయాలకు జిల్లాలో పేరొందిన మార్కెట్ కావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే గాకుండా తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రాల నుంచి ముస్లింలు ఖుర్బానీ ఇచ్చేందుకు పొట్టేళ్ల కొనుగోలు కోసం భారీ సంఖ్యలో తరలివచ్చారు. బక్రీద్ పండుగకు దంతాలు ఉండి ఏడాది వయసున్న పొట్టేళ్లను ఖుర్బానీ ఇవ్వాలన్న ఆచారం ఇస్లాంలో ఉండటంతో ఆ మేరకు పెద్ద పొట్టేళ్ల క్రయవిక్రయాలు జరిగాయి. పొట్టేళ్లు ఒక్కోటి రూ.16 వేల నుంచి రూ.50 వేలకు పైగా ధర పలికాయి. పొట్టేళ్లను ఏడాది పాటు పెంచి పోషించి అమ్ముకొనే ఈ ప్రాంత రైతులు మాత్రం ధరలను కొంతమేర తగ్గించి విక్రయించినా వ్యాపారులు మాత్రం అనుకున్న ధరలకు విక్రయించుకొని వెళ్లారు. పండుగకు కేవలం ఒక్కరోజు ముందుగా ఆదివారం సంత జరగడంతో పొట్టేళ్ల కొనుగోళ్లు భారీగా జరిగాయి.

గాజులదిన్నె ప్రాజెక్టు పరిశీలన



గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

గోనెగండ్ల: మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టును ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఈఈ శైలేశ్వర్ రెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా క్రస్ట్ గేట్లు, జీడీపీలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతం జీడీపీలో ఉన్న నీటి నిల్వ, జీడీపీ సామర్థ్యం, ఆనకట్టు ఎత్తు పెంచే పనులను, జీడీపీకి రావాల్సిన నీటి వాట, నిధులు తదితర వాటిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆనకట్ట ఎత్తు పెంచే పనులు, గేట్ల పనులు ఇంకా పూర్తి కాలేదని వర్షకాలంలో వరద నీటితో ప్రాజెక్టు నిండి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రమాదం జరగకముందే ఒక్క గేటు ఎత్తడానికైనా అవకాశం ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డీఈ విజయకుమార్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఆ పార్టీ నాయకులు నజీర్, బేతాలబడేసా, తిరుపతయ్య, రహంతుల్లా, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

మెప్మా సిబ్బందితో సమీక్ష

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో ఆదివారం మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రుణాల మంజూరు తదితర అంశాలపై మెప్మా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మెప్మా సీఎంఎం జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోండి



గోనెగండ్లలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణయ్య



హాజరైన ప్రముఖులు

గోనెగండ్ల: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, ఆయా సంఘాల వారితో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే ముందుగా పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. పూర్తిగా విషయం తెలుసుకోకుండా సామాజిక మధ్యమాల్లో వైరల్ చేస్తూ గొడవలకు పురిగొల్పితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నేడు జరిగే బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. వాట్సాప్ గ్రూపులలో కులమతాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టరాదని, అలాంటి పోస్టులకు వ్యక్తితో పాటు అడ్మిన్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అల్లరిమూకలు తీరు మార్చుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, మతపెద్దలు పాల్గొన్నారు.

కౌతాళం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల నాయకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ రోజున ఖుర్బానీ వేడుకలను బహిరంగ ప్రదేశాల్లో చేసుకోరాదన్నారు. ఈద్గాల వద్ద ప్రశాంత వాతవరణంలో నమాజులు ఆచరించాలని, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన కౌతాళం ఖ్యాతిని నిలబెట్టాలన్నారు. అనాదిగా వస్తున్న మత సామరస్య ఖ్యాతిని ఈ ఏడాది కూడా చాటాలని సీపీఎం మండల సీనియర్ నాయకుడు మల్లయ్య, కౌతాళం సింగల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు వెంకటపతిరాజు, బీజేపీ జిల్లా నాయకుడు రామకృష్ణ పిలుపినిచ్చారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, లడ్డు ఖాదర్‌బాషా, వలిసాబ్, కాశీవిశ్వనాథ్, దాట్ల సుబ్బారాజు, నబిరసూల్, మహమ్మద్, సిద్ధూ, మంజునాథ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కౌతాళంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

దాతృత్వానికి ప్రతీక బక్రీద్

- ముస్తాబైన ఈద్గా, మసీదులు
- నేడు బక్రీద్ పండుగ

ఎమ్మిగనూరుటౌన్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే, దాతృత్వానికి, త్యాగానికి ప్రతీకగా నెలవైన బక్రీద్ (ఈద్–ఉల్–అజ్‌హా)పండుగను సోమవారం ఘనంగా జరుపుకునేందుకు పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బక్రీదు ప్రత్యేక నమాజు కోసం పట్టణంలోని మార్కెట్ కమిటీ రోడ్డులోని ఈద్గాతో పాటు, స్టేట్ బ్యాంక్ వద్ద గల ఈద్గాల్లో తగిన ఏర్పాట్లు చేసి ఆ మేరకు సౌకర్యాలను సిద్ధం చేశారు. శాంతి సామరస్యంగా పండుగను నిర్వహించుకొనేందుకు ఇప్పటికే డీఎస్పీ సీతారామయ్య, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి నేతృత్వంలో మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. పట్టణంలో మసీదులలో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. కమిటీ రోడ్డులోని ఈద్గాలో ఉదయం 8 గంటలకు, జామియా మసీదులో 8.30 గంటలకు, స్టేట్ బ్యాంక్ వద్ద గల జమాతే ఆహ్లే హదీస్ ఈద్గాలో 6.30 గంటలకు, సోగనూరు రోడ్డులోని మహమ్మదీయ మసీదులో 7.45 గంటలకు, శిల్పా ఎస్టేట్‌లో మజీద్ ఏఅరాఫత్‌లో 7.30 గంటలకు, కర్నూలు బైపాస్‌లోని నూరాని మసీదులో 6.45 గంటలకు, లక్ష్మీపేట మసీదులో 7.30 గంటలకు, శివసర్కిల్‌లోని మసీదే అబూబకర్‌లో 6.30 గంటలకు, మసీదే అయేషాలో 8 గంటలకు, హఫీజ్ మసీదులో 8 గంటలకు, బిలాల్ మసీదులో 7.30 గంటలకు, ముగతి మొహల్ల మసీదులో 7.30 గంటలకు, ఎస్ఎంటీ కాలనీ మదీనా మసీదులో 8 గంటలకు, ముగతిపేట మీనా మసీదులో 7.30 గంటలకు, సుల్తాన్ మసీదులో 7.30గంటలకు, కర్నూలు రోడ్డులోని మహమ్మదీ మసీదులో 6.30 గంటలకు ప్రత్యేక నమాజులు నిర్వహించనున్నట్లు మత పెద్దలు ప్రకటించారు.

దాతృత్వానికీ ప్రతీక

ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం ఖలీలుల్లాకు లేక లేక పుట్టిన కుమారుడు హజరత్ ఇస్మాయిల్‌ను అల్లాహ్ ఆజ్ఞ మేరకు బలి ఇచ్చేందుకు పూనుకొన్నట్లు వచ్చిన కల నిజమైనదిగా భావించిన ఆయన తన కన్న కొడుకునే బలిఇవ్వాలని నిర్ణయించుకొని ఉపక్రమిస్తాడని మత పెద్దలు పేర్కొంటారు. దీంతో కుమారుడిని బలివ్వబోగా హజరత్ ఇబ్రహీం దైవ భక్తిని సంతోషించిన అల్లాహ్ బలికి సిద్ధమైన కుమారుడి స్థానంలో పొట్టేలు (దుంబా) ప్రత్యక్షం చేయడంతో దాన్ని బలిదానం చేయడం జరుగుతుంది. భగవంతుని ఆదేశాలతో తన కుమారుడినే బలిదానం చేయడానికి సిద్ధపడటంతో బక్రీద్ పండుగ రోజు ఖుర్బానీ నిర్వహిస్తూ త్యాగానికీ, దానానికీ ప్రతీకగా జరుపుకొంటారు. మహమ్మద్ ప్రవక్త ఈ నియమాన్ని ఆచరించడంతో ముస్లింలు ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారని ముస్లిం పెద్దలు పేర్కొంటారు. బక్రీదు పండుగరోజు ఒక వ్యక్తి ఒక పొట్టేలునుగానీ, ఏడుగురు వ్యక్తులు కలసి ఒక ఒంటెను గానీ దానం ఇవ్వాలని ఆచారం. వారు దానం చేసే మాంసంను మూడు భాగాలుగా విభజించి కుటుంబ సభ్యులకు ఒక భాగం, ఆప్తులకు రెండో భాగం, నిరుపేదలకు మూడో భాగంను పంచడం బక్రీదు పండుగ ప్రత్యేకత. దైనందిత జీవితంలో మనుషుల సంపాదనను కూడా ఈ విధంగా పంచాలన్నదే బక్రీద్ సందేశంగా పేర్కొంటారు.